క్లుప్తంగా

త్యాగరాజు రామభక్తిపై ప్రవచనం



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: అనపర్తిలోని శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న త్యాగరాజు ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం రాత్రి త్యాగరాజు రామభక్తిపై సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనం నిర్వహించారు. కలియగంలో భక్తి మార్గాన అనుసరించాల్సిన విధానాలను వివరించారు. మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం శర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సబ్బెళ్ల అమ్మిరెడ్డి, గోశాల ధర్మారెడ్డి, కర్రి ధర్మారెడ్డి, రాష్ట్ర పామాయిల్ రైతుల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు సత్తి రామారెడ్డి, సమితి అధ్యక్షులు తమలంపూడి చిన్న ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలీల సరాసరి వేతనాలు పెరగాలి

బిక్కవోలు: కూలీల సరాసరి వేతనాలు పెరగాలని ఎంపీడీవో వి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం బిక్కవోలు, రంగంపేట, అనపర్తి మండలాల్లో పనిచేస్తున్న జాతీయ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీల వేతనాన్ని రూ.300 వరకు ప్రభుత్వం నిర్ణయించిదన్నారు. వారికి పూర్తి వేతనం వచ్చేలా మార్కింగ్ ఇవ్వడం, కొలతలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు, జాతీయ ఉపాధి హామీ ఏపీవో జి.అగస్టీన్ కుమార్, ఈసీ కె.సందీప్ రెడ్డి, రంగంపేట ఈసీ రాజేష్, గోకవరం జేఈ పి.రత్నరాజు పాల్గొన్నారు.

రెండు చోట్ల చోరీకి యత్నం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో గురువారం రాత్రి రెండుచోట్ల చోరీకి యత్నాలు జరిగాయి. ఎస్సై వాసంశెట్టి రవి చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఇండియన్ బ్యాంకు ఏటీఎంను బద్ధలు కొట్టడానికి గురువారం రాత్రి దొంగలు ప్రయత్నించారు. అయితే ఏటీఎంలో అలారం మోగడంతో అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం అక్షయ జ్యూయలరీ షాపులో చోరీ చేయడానికి షట్టరు బద్ధలు కొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే సమయంలో 3 కావడం, చుట్టుపక్కల జనాల సంచారం మొదలు కావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పతంగుల సందడి

- మార్కెట్‌లో రంగురంగుల గాలిపటాలు
- ఉత్సాహంగా ఎగుర వేస్తున్న చిన్నారులు

బిక్కవోలు: సంక్రాంతి వచ్చిందంటే ఎక్కడ చూసినా పండగ సందడి నెలకొంటుంది. పిల్లలు, పెద్దలు అంతా ఎంతో ఉత్సాహంగా పనులు చేసుకుంటూ ఉంటారు. పండగ కోసం పిండి వంటలు సిద్ధం చేయడంలో మహిళలు నిమగ్నమవుతారు. మిగిలిన పనుల్లో పెద్దవాళ్లు బిజీబిజీగా గడుపుతారు. ఇక చిన్నపిల్లలు పతంగులతో సందడి చేస్తుంటారు.

రంగుల గాలిపటాలు

పాఠశాలలకు సెలవులు ప్రకటించటంతో విద్యార్థులు పతంగుల సంబరాల్లో మునిగిపోయారు. పదపదవే గాలిపటమా అంటూ చిన్నారులు సందడి చేస్తున్నారు. గాలిపటాలు ఎగుర వేస్తూ ఆనందంగా గడిపేస్తున్నారు. అపార్టుమెంట్లు, డాబాలు, ఖాళీ ప్రదేశాల్లో గాలిపటాల సందడి జోరుగా సాగుతోంది. వివిధ రంగులు, ఆకృతుల్లో తయారు చేసిన పతంగులు దుకాణాల్లో దర్శనమిస్తున్నాయి.

చిన్నారుల కోసం..

చిన్నారుల కోసం బాహుబలి, డోరిమాన్, చోటాబీమ్ వంటి పతంగులు ఉన్నాయి. పిల్లలు ఇష్ట పడే కార్టున్లతో గాలిపటాలు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. కొందరు చిన్నారులు ఇంట్లోనే కాగితాలతో స్వయంగా గాలిపటాలను తయారు చేసుకుని ఎగుర వేస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- గాలిపటాలను ఎగురవేసేటప్పుడు పిల్లలు అనేక జాగ్రత్తలు పాటించాలి. మంజాను ఎక్కువగా వాడకూడదు. దానివల్ల చేతులు కొసుకునే ప్రమాదం ఉంది.
- విద్యుత్ తీగలకు చిక్కుకున్న గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించ కూడదు. బహిరంగ ప్రదేశాల్లోనే గాలిపటాలను ఎగురవేయాలి. తెగిన గాలిపటాలను అందుకునేందుకు రోడ్లపై అడ్డంగా పరుగెత్తకూడదు.
- భవనాలపై పతంగులు ఎగురవేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆకాశంలో పతంగి ఎగురుతున్నప్పుడు నేలపై పరుగులు తీయొద్దు.



పందలపాకలో గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నారులు



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న గాలిపటాలు

పోటీ పడతాం



సంక్రాంతి పండగ రావటానికి పది రోజుల ముందు నుంచే గాలిపటాలను ఎగుర వేస్తాం. ఆకాశంలో అవి ఎగురుతూ ఉంటే చాలా ఆనందంగా ఉంటుంది. ఒకరి కంటే ఒకరం ఎత్తుగా గాలిపటాలను ఎగురవేయాలని పోటీ పడుతుంటాం.

– కరక యశ్వంత్, పెదపూడి

ఆనందంగా ఉంది



ఈ సంవతర్సరం మార్కెట్లో వివిధ రకాల మోడళ్ల గాలిపటాలు వచ్చాయి. వీటిని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మా పెద్దమ్మ ఇంటి వెళ్లి అక్కడ గాలిపటాలు ఎగురవేస్తాం. సంక్రాంతి సెలవుల్లో ఉత్సాహంగా గడుపుతాం.

– సలుమూరి కార్తికేయ, పందలపాక

చాలా ఇష్టం



చిన్నప్పుడు నుంచి గాలిపటాలు ఎగుర వేయడం అంటే చాలా ఇష్టం. అప్పట్లో కాగితాలతో గాలిపటాలు తయారు చేసేవాళ్లం. ఇప్పుడు పిల్లలకు తయారు చేయడం కంటే మార్కెట్ కొనుగోలు చేస్తున్నాం.

– గొర్రిపోటి అప్పారావు, పందలపాక, లాయర్

రామనామ తలంబ్రాలకు అంకురార్పణ

పెదపూడి: జి.మామిడాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు, వ్యాయామ దర్శకుడు లయన్ ద్వారంపూడి యువరాజారెడ్డి శుక్రవారం రామనామ తలంబ్రాలకు అంకురార్పణ చేశారు. శ్రీరామనవమి సందర్భంగా గొల్లల మామిడాడలో జరిగే కోదండ రామచంద్రమూర్తి కల్యాణ మహోత్సవాలకు రామనామ లిఖిత తలంబ్రాలను ఏటా ఆయన సిద్ధం చేస్తారు. ఈసారి కూడా ముక్కోటి ఏకాదశి రోజు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం బియ్యపు గింజలపై రామనామాన్ని ఎటువంటి సూక్ష్మ పరికరం లేకుండా మార్కర్ పెన్ సాయంతో లిఖించి అంకురార్పణ చేశారు. గత 15 ఏళ్లగా రామనామ లిఖిత మహాయజ్ఞాన్ని రాముని కృపతో చేస్తున్నట్టు యువరాజారెడ్డి తెలిపారు. 10,116 బియ్యపు గింజలతో ప్రారంభించిన ఈ మహాయజ్ఞం ఇప్పటికీ వరకూ 7 లక్షల పైబడి రాయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం లక్ష బియ్యపు గింజలపై రాయడానికి సంకల్పించామన్నారు.



రామనామ తలంబ్రాలకు అంకురార్పణ చేస్తున్న యువరాజారెడ్డి

నియోజకవర్గంలో 30 గోకులం షెడ్లు

మధురపూడి: రాజానగరం నియోజక వర్గంలో 30 గోకులంలో షెడ్లు (పశువుల శాలలు) నిర్మాణం పూర్తయినట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. కోరుకొండ మండలం బూరుగుపూడి, మధురపూడి గ్రామాల్లో నిర్మించిన షెడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. బూరుగు పూడి పీఏసీఎస్ మాజీ చైర్మన్ కంటే నాగకేశవరావు, ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, ఏపీఎం భ్రమరాంబ, సీఐ సత్య కిషోర్, ఎస్సై శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనుల పరిశీలన

రంగంపేట: ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ శుక్రవారం పరిశీలించారు. మధురపూడి విమానాశ్రయం నుంచి పిఠాపురం పర్యటనకు వెళుతున్న ఆయన రాజానగరం నుంచి సామర్లకోట వరకు అభివృద్ధి చేస్తున్న ఏడీబీ రోడ్డు పనులను రంగంపేట మండల పరిధిలో పలుచోట్ల ఆగి పరిశీలించారు. కలెక్టర్ పి.ప్రశాంతి గ్రామాల వారీగా పనుల పురోగతిని ఆయనకు వివరించారు.

ప్రమాద స్థలం పరిశీలన

వేమగిరిలో జరిగిన గేమ్ చేంజర్ సినిమా రిలీజ్ ఈవెంట్‌కు వెళ్లి తిరిగి వస్తున్న కాకినాడ చెందిన ఇద్దరు యువకులు గత శనివారం వడిశలేరు–రంగంపేట గ్రామాల మధ్య వ్యాన్ ఢీకొని మృతి చెందారు. ఆ ప్రదేశాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరిశీలించారు.



ఎస్టీ రాజాపురం వద్ద ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మధురపూడి: కిశోర బాలికల ఆరోగ్యంపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని ఉపాధ్యాయుడు నాగేంద్ర అన్నారు. కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వార్యాన శుక్రవారం కిశోర వికాసం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఐసీడీఎస్ శాఖ ఏసీడీపీఓ వరలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహల కారణంగా స్త్రీలకు రక్తహీనత, తదితర రోగాలు వస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జి.ఝాన్సీ, మోహన్‌లక్ష్మి, బాపనమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు నాగేంద్ర

తహసీల్దార్‌గా సత్యవతీదేవి



తహసీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

రాజానగరం: తహసీల్దార్‌గా జీఏఎల్ సత్యవతీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.లక్ష్మీలావణ్యను కలెక్టరేట్‌కు, అక్కడ సూపరింటిండెంట్ (తహసీల్దార్)గా విధులు నిర్వర్తిస్తున్న సత్యవతీదేవిని మండలానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేసిన సంగతి విదితమే. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆమె ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు శుభాకాంక్షలు తెలిపారు.

తరపట్ల సత్యనారాయణకు సేవా పురస్కారం



సేవా పురస్కారం అందుకుంటున్న సత్యనారాయణ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో తెలుగు విభాగం అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ తరపట్ల సత్యనారాయణకు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో విశిష్ట సేవా పురస్కారం లభించింది. తెలుగు వెలుగులు విరబూయాలంటే ఉపాధి దిశగా తెలుగు అనే నినాదంతో సరికొత్త ఉద్యమం రావాలనే ఆయన సూచనకు నిర్వాహకులు ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా నన్నయ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు శుక్రవారం ఆయనను అభినందించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

పెదపూడి: అనపర్తిలో శారదా సంగీత కళాసమితి వారి 26వ త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాల్లో శ్రీకాకుళానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్, నాట్య ప్రవీణ డాక్టర్ శ్రీకాంత్ రఘుపాత్రుని శిష్యబృందం శాస్త్రీయ కూచిపూడి నృత ప్రదర్శన చేసింది. అనంతరం శ్రీకాంత్‌రఘుపాత్రుని, ఆయన శిష్యబృందం, సహ వాద్యకారులను తేతలి ఉపేంద్రరెడ్డి, తేతలి శ్రీసత్యసాయి రామారెడ్డి, శారదా సంగీత కళాసమితి సభ్యులు ఘనంగా సత్కరించారు.

సర్వసభ్య సమావేశం

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఐదుగురు సర్పంచ్‌లు, ఏడుగురు ఎంపీటీసీలు హాజరయ్యారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చినకొండేపూడి, రాపాక గ్రామాల్లో ఏర్పాటు చేసిన షెడ్లను ప్రారంభించారు.

బ్రహ్మజోస్యులకు నివాళి

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమం ఘన చరిత్రను నేటి తరానికి తెలియజెప్పాలని, ఆశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని చరిత్ర పరిశోధకుడు, ఆశ్రమ చరిత్ర రచయిత బొంగు రాజారావు అన్నారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సీతానగరం ఆశ్రమంలో బ్రహ్మజోస్యుల విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు



అనపర్తి పాతఊరిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

పెదపూడి: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనపర్తి గ్రామం పాత ఊరిలోని పోతారెడ్డి రామిరెడ్డి రామాలయంలో గల సీతారాములు, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. అనపర్తి, రంగంపేట, పెదపూడి, బిక్కవోలు, రాజానగరం, సీతానగరం, రాజానగరం మండలాల్లో ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు.

సారా స్థావరాలపై దాడులు

రంగంపేట: సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ శుక్రవారం తెలిపారు. స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈలకొలను, దొడ్డిగుంట గ్రామాలలో రాజమహేంద్రవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌తో కలసి దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా 175 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 3,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. సారా విక్రయిస్తున్న కె.గోవిందు, జె.శివరాం, కె.చిట్టెమ్మలపై కేసు నమోదు చేశామన్నారు.



ఈలకొలనులో స్వాధీనం చేసుకున్న సారా డమ్ములతో అధికారులు

ప్రగతి పథంలో రాజానగరం

- విద్యా, వైద్యాలయాలకు నిలయం
- జిల్లా కేంద్రానికి చేరువగా ఉండడమే ప్రధాన కారణం

రాజానగరం: నాడు పంచాయతీ సమితికి, నేడు నియోజవర్గానికి కేంద్రం బిందువుగా ఉన్న రాజానగరం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. జిల్లాల పునర్విభజనతో ఏర్పడిన నవ్య తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరానికి అత్యంత చేరువలో ఉండటంతో అభివృద్ధి జరుగుతోంది. రాజమహేంద్రవరానికి ఒక వైపు అఖండ గోదావరి ఉండటంతో అటుగా విస్తరణకు అవకాశం లేదు. రెండో వైపు తూర్పు, ఉత్తర దిశలలో రాజానగరం, కడియం ప్రాంతాలున్నాయి. అయితే వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య రంగాల పరంగా సానుకూలమైన వాతావరణంతో ఉన్న రాజానగరం వైపు విస్తరణ, అభివృద్ధి వేగవంతంగా జరుగుతోంది. రియల్ ఎస్టేట్ రంగంతో పాటు అనేక రకాల వ్యాపారాలు, విద్యాలయాలు, వైద్యాలయాలు, హోటళ్లు, షాపింగ్ మాళ్లు ఇటువైపునకే వస్తున్నాయి. ఈ ప్రాంతం మీదుగా సుమారు 22 కిలోమీటర్ల వరకూ 16వ నంబరు జాతీయ రహదారి వెళుతోంది.

నన్నయ యూనివర్సిటీ

తెలుగు రాష్ట్రాలలోనే అతిపెద్దదైన ఆదికవి నన్నయ యూనివర్సిటీ (వెలుగుబంద) ఈ ప్రాంతంలోనే ఉంది. దీనికి అనుబంధంగా తాడేపల్లిగూడెం, కాకినాడలోని క్యాంపస్‌లతో పాటు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని 450 కళాశాలలు ఉన్నాయి. సుమారు 1,85,000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

స్టేట్ ఫారెస్టు అకాడమీ

రాష్ట్ర పునర్విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అటవీశాఖ ఉద్యోగుల కోసం స్టేట్ ఫారెస్టు అకాడమీని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇందుకోసం రాష్ట్రంలో ఎన్నో ప్రాంతాలను పరిశీలించారు. చివరకు దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టులోని అటవీ శాఖ ప్రాంతీయ పరిశోధన కేంద్రంలోనే ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీని 2017లో ప్రారంభించారు.



ఆదికవి నన్నయ యూనివర్సిటీ

అంతర్జాతీయ విమానాశ్రయం

కోరుకొండ మండలం మధురపూడిలో అంతర్జాతీయ ఎయిర్ పోర్టు ఉంది. ఇక్కడి నుంచి హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, తిరుపతి తదితర ప్రాంతాలకు విమాన సర్వీసులు నడుస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో కూడా సర్వీసులు నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)


శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగ ఫలితాలను రైతాంగానికి అందించి, తద్వారా వ్యవసాయాభివృద్ధికి తోడ్పడేలా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే -కలవచర్ల) కూడా రాజానగరం నియోజకవర్గంలోనే ఉంది. దీని రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయి.

ఆధ్యాత్మిక కేంద్రం

స్వయంభుగా వెలిసిన ప్రసిద్ధి చెందిన కోరుకొండ లక్ష్మీ నరసింహుని పుణ్యక్షేత్రం ఇక్కడే ఉంది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలోనే పాండవుల కొండ, మరికొన్ని ప్రముఖ దేవాలయాలు ఉన్నాయి.

గైట్‌కు యూనివర్సిటీ గుర్తింపు

జాతీయ రహదారిని ఆనుకుని వెలుగుబంద పంచాయతీ పరిధిలో ఉన్న గోదావరి ఇంజినీరింగ్ కళాశాల గోదావరి గ్లోబల్ యూనివర్సిటీగా గుర్తింపు సాధించింది. ఇదే ప్రాంగణంలో మరో రెండు ఇంజినీరింగ్ కళాశాలలు, డిగ్రీ, పాలిటెక్నిక్, ఫార్మసీ కళాశాలలు కూడా ఉన్నాయి. ఈ ప్రాంతంలోనే ప్రతి ఏటా జనవరిలో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తుంటారు. అలాగే జాతీయ రహదారిని ఆనుకుని తూర్పుగానుగూడెంలో ఐఎస్‌టీఎస్ మహిళ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేశారు. దివాన్ చెరువు నుంచి పాలచర్లకు వెళ్లే మార్గంలో పాలచర్ల పంచాయతీ పరిధిలోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలకు మంచి గుర్తింపు ఉంది.



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

జీఎస్ఎల్ ఆస్పత్రి

జాతీయ రహదారిని అనుకుని ఉన్న జీఎస్ఎల్ వైద్య కళాశాలకు ఎంతో పేరు ఉంది. దీనికి అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రి అత్యుత్తమ వైద్య సేవలకు చిరునామాగా మారింది. పక్కనే దంత, నర్సింగ్ కళాశాలలు ఉన్నాయి. గోదావరి జిల్లాల నుంచే కాకుండా తెలుగు రాష్ట్రాల నుంచి ఇక్కడకు మెరుగైన వైద్యం కోసం రోగులు వస్తుంటారు.

హోల్ సేల్ పండ్ల మార్కెట్

దివాన్ చెరువులో జాతీయ రహదారిని అనుకుని హోల్‌సేల్ పండ్ల మార్కెట్ ఉంది. ఒకరిద్దరు చిరు వ్యాపారులు కలిసి ఒక లారీతో ప్రారంభించిన మార్కెట్ దశాబ్ద కాలంలోనే నిత్యం 25 లారీలలో వివిధ రకాల పండ్లను దిగుమతి చేసుకుని, పరిసరాలలోని చిరు వ్యాపారులకు హోల్‌సేల్‌గా అందించేలా అభివృద్ధి చెందింది.

రియల్ ఎస్టేట్

రాజానగరం పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ విస్తరిస్తోంది. సుమారు 275 వరకు వెంచర్లు ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్నాయి..



జీఎస్ఎల్ వైద్య కళాశాల



గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ

సంతాన సాఫల్యం సులభతరం

కాకినాడ క్రైం: ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో లండన్ ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ చంద్రా రెడ్డి తెలిపారు. 2015లో విశాఖపట్నంలో తొలి బ్రాంచ్ ప్రారంభించినట్లు చెప్పారు. సంతానోత్పత్తి చికిత్సలో విశేష సేవలందిస్తోందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత జెనోమిక్ ఫెర్టిలిటీ అనాలసిస్ టెక్నాలజీని లండన్ ఐవీఎఫ్ అందిపుచ్చుకుందన్నారు. జీనీఫెమినా, జీనీ యాండ్రో అనే అధునాతన సాంకేతిక ప్రక్రియల ద్వారా పురుషులతో పాటు మహిళలల్లోనూ వంధ్యత నివారణకు చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. జీన్ టెక్, జీఎఫ్ఏ టెక్నాలజీల సాయంతో జీనీఫెమినా, జీనియాండ్రో చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. యూకేలో శిక్షణ పొందిన వైద్య నిపుణులను ఈ చికిత్సల కోసం వినియోగిస్తున్నామన్నారు. పునరుత్పత్తి వైఫల్యాలను కనుగొనేందుకు చేసిన కృషికి గాను టైమ్స్ గ్రూప్ ద్వారా ఏపీ బెస్ట్ అవార్డును అందుకున్నామని చెప్పారు. జీన్‌టెక్ వ్యవస్థాపకులు, చీఫ్ సైన్స్ అధికారి డాక్టర్ అనురాధా ఉడుముడి పునరుత్పత్తి చికిత్సా విధానాలలో సాంకేతికతను జోడించేందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.



జీన్‌టెక్ సంస్థతో సాంకేతిక ఒప్పందాలను కుదుర్చుకుంటున్న లండన్ ఐవీఎఫ్ ప్రతినిధులు

గ్రామీణ ప్రజలకు అత్యాధునిక నేత్ర వైద్య సేవలు

పెదపూడి: అనపర్తి నారాయణరెడ్డి కంటి ఆస్పత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రోబోటిక్ లేజర్ లాసిక్ శస్త్రచికిత్స అందుబాటులో ఉందని నేత్ర వైద్య నిపుణుడు తేతలి సత్యనారాయణరెడ్డి తెలిపారు. అనపర్తి, పరిసర గ్రామాల ప్రజలకు 50 ఏళ్లుగా కంటి వైద్యం అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆధునిక పరికరాలతో, అత్యాధునిక సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. తేతలి సత్యనారాయణరెడ్డి తనయుడు డాక్టర్ వెంకటరామిరెడ్డి, కోడలు డాక్టర్ సంధ్యారెడ్డి కంటి వైద్యంలో ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు అందుబాటులో తీసుకువస్తున్నారన్నారు.

ప్రజలకు అందుబాటులో స్కానింగ్ సౌకర్యం

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంలో అత్యాధునిక స్కానింగ్ సౌకర్యాన్ని పావని సిటీ స్కానింగ్ సెంటర్ అందిస్తున్నారు. ఒకప్పుడు నగరాలకు మాత్రమే పరిమితమైన రోగనిర్ధారణ సేవలు ఇప్పుడు మండపేట రామచంద్రపురం అనపర్తి ప్రజలకు అందుబాటులో ఉంది. ఇక్కడ రోగులు, గర్భిణులకు అవసరమైన సిటీ స్కానింగ్, అన్ని రకాల స్కానింగ్‌లతో పాటుగా ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేస్తున్నారు. అతి తక్కువ ఖర్చులతో నాణ్యమైన వైద్యం స్థానికంగా రామచంద్రపురంలో పావని సిటీ స్కానింగ్ సెంటర్ ద్వారా అందిస్తున్నట్లు డాక్టర్ బికె శివప్రసాద్ గురువారం తెలిపారు.

సుజుకీ వారి బంపర్ ఆఫర్లు

రాజమహేంద్రవరం: సుజుకీ ఆథరైజ్డ్ డీలర్ కంటిపూడి సుజుకీ సంక్రాంతి సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేకమైన లక్కీ డ్రా ఆఫర్ల సౌకర్యం కల్పించింది. మొదటి బహుమతిగా మారుతీ సుజుకీ ఫ్రాంక్స్ కారు, రెండో బహుమతిగా అయిదుగురికి సుజుకీ జిక్సర్ ఎస్ఎఫ్ 250 బైక్, మూడో బహుమతిగా 15 మందికి సుజుకీ జిక్సర్ 250 బైక్స్, నాలుగో బహుమతిగా 20 మందికి ఆపిల్ ఐ ఫోన్ (15, 128 జీబీ)ను ప్రకటించారు.

సొంతూరిపై మమకారంతో వైద్య సేవలు

పెదపూడి: ప్రపంచంలో ఎంత ఎత్తుకు ఎదిగినా సొంతూరుపై మమకారం చాటడం ఓ సామాజిక బాధ్యత. అలా సేవలందిస్తున్న ప్రముఖుల్లో జి.మామిడాడ గ్రామానికి చెందిన డాక్టర్ టి.శివప్రసాద్‌రెడ్డి ఒకరు. గత 15 సంవత్సరాలుగా జి.మామిడాడలో రామలక్ష్మణ్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలను నిర్వహిస్తున్నారు. సొంతూరులోనే అందుబాటులో ఉంటూ అత్యాధునిక వైద్య, సాంకేతిక పరికరాలతో సామాన్య ప్రజలకు వైద్యం చేస్తున్నారు. నాణ్యమైన సేవలందిస్తున్న డా.శివప్రసాద్‌రెడ్డిని గ్రామానికి చెందిన ప్రముఖులు అభినందించారు.